

15 బండిల్స్ చైనా మాంజా పట్టివేత

● ఇద్దరిపై కేసు నమోదు



పట్టుబడిని మాంజాలతో ఎస్ఐ కళ్యాణ్‌కుమార్

7

విద్యానిధి విద్యార్థుల పెన్నిధి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పాఠశాలల్లో చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి ఈ నిధి ఏర్పాటు
- విద్యార్థులు, నిరుద్యోగుల్లో నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తా
- లా, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ సంవత్సరం నుంచి తరగతులు
- పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ఏడాదిలో రూ. 120 కోట్ల ఖర్చు
- కార్పొరేషన్ ఏర్పాటుతో మహబూబ్‌నగర్‌కు గౌరవం పెరుగుతుంది
- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

"ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారంతా పేద విద్యార్థులే.. మా క్షేత్రస్థాయి పర్యటనల్లో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు దృష్టికి వస్తున్నాయి. వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టి, నిధులు వచ్చే వరకు విద్యార్థులు ఇబ్బందులు పడతారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి అందుబాటులో నిధులు ఉండాలి. అందుకే విద్యానిధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రతీ ఏటా రూ. 2 కోట్లు సేకరించడం లక్ష్యంగా పెట్టుకుని ముందుకెళ్తున్నాం. ఐదేళ్లలో రూ. 10 కోట్లు సేకరించాలి. పేద విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే దీని లక్ష్యం. క్విజ్, ఆటల పోటీల నిర్వహణ, ప్రతిభ కలిగిన విద్యార్థులకు కోచింగ్, పోటీ పరీక్షలకు తయారీ, పరీక్షల సమయంలో స్నాక్స్ ఏర్పాటు, పాఠశాల శుభ్రత కోసం స్కావెంజర్లు, కంప్యూటర్ శిక్షణ కోసం ఇన్‌స్ట్రక్టర్లు, స్పోకెన్ ఇంగ్లిష్ చెప్పించవచ్చు." అంటున్న మహబూబ్‌నగర్ శాసనసభ్యుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఏడాది పాలన విశేషాలు, భవిష్యత్ ప్రణాళికపై 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఇంజనీరింగ్, లా కాలేజీలకు వసతులు సమకూరినట్లేనా?

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో లా, ఇంజనీరింగ్ కాలేజీ రావడం అదృష్టం. ఈ ఏడాది మొదటి సంవత్సరం ప్రారంభవుతుంది. క్లాసు రూమ్‌లు, హాస్టళ్ల అందుబాటులో ఉన్నాయి. శాశ్వత నిర్మాణాల కోసం టెండర్ ప్రక్రియ త్వరలో మొదలు కానుంది. రెండో సంవత్సరం వచ్చే సరికి శాశ్వత భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం.

పెండింగ్ బిల్లుల పరిస్థితి ఏంటీ?

కాంగ్రెస్ అధికారం చేపట్టాక రూ. 40 వేల కోట్ల పెండింగ్ బిల్లుల్లో రూ. 14 వేల కోట్లు క్లియర్ అయ్యాయి. ఇంకా అవుతాయి. అయితే కొన్ని పనులను ఫైనాన్స్ అప్రూవల్ లేకుండానే చేశారు. కాగితాల మీద పనులు చేశారు.

శ్రమదానం చేస్తున్నారు.. దాని ఉద్దేశం, లక్ష్యం ఏంటీ?

జిల్లా కేంద్రం పెద్దది. కాలనీలు, పార్కులు, ప్రభుత్వ సంస్థల పరిశుభ్రత మనది కాదని ఎవరికి వారు అనుకుంటున్నారు. అందుకే వాటి పరిరక్షణ బాధ్యత మనదేనని చెప్పేందుకు ప్రజలను భాగస్వామ్యం చేయడానికి ఈ శ్రమదానం చేస్తున్నాం. మొదట పాఠశాలలు, హాస్టళ్లలో నిర్వహించి. తర్వాత కాలనీలు, పార్కులకు విస్తరిస్తాం. గతంలో పార్కులు ఏర్పాటు చేశారు. కానీ, ప్రజలకు పరిరక్షణ అవగాహన కల్పించి భాగస్వాములను చేయలేదు.

కాలనీలకు వెళుతున్నప్పుడు ఎలాంటి సమస్యలు గుర్తిస్తున్నారు?

క్షేత్రస్థాయిలో పర్యటించకపోతే అన్నీ పెద్ద సమస్యలే తెలుస్తాయి. చిన్నచిన్న సమస్యలు మా దృష్టికి రావు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు, ట్యాంకులు తదితర సమస్యలు మా దృష్టికి వస్తున్నాయి. పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్లు 160 మంది ఉన్నారు. అక్కడ శిక్షణ ప్రాంతం అడవిగా తయారైంది. క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు మా దృష్టికి వచ్చింది. దాన్ని ఇప్పుడు సిద్ధం చేస్తున్నాం. అది వినియోగంలోకి తెస్తే రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరం ఇక్కడ నిర్వహించవచ్చు.

కార్పొరేషన్ ప్రకటన వచ్చింది? ఎలా ఫీలవుతున్నారు?

మహబూబ్‌నగర్ జిల్లా (మిగతా 6లో..)



వనపర్తి బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

సెలవులొచ్చాయ్..

రాష్ట్ర ప్రభుత్వం 11వ తేదీ నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించింది. దీంతో వనపర్తి జిల్లాలోని వివిధ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులను సొంత గ్రామాలకు తీసుకెళ్లేందుకు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వనపర్తి పట్టణానికి చేరుకున్నారు. విద్యార్థులను, వారి లగేజీని కూడా తీసుకెళ్తుండటం, అందరు ఒకే రోజు రావడంతో వనపర్తి పట్టణం సందడిగా మారింది. అంతే కాకుండా పండుగకు సొంత గ్రామాలకు వెళ్లే వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా వనపర్తి పట్టణానికి వస్తున్నారు. దీంతో బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఈ దృశ్యాలను శనివారం ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

-ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి





వనపర్తి బస్టాండుకు లగేజీతో వెళ్తున్న విద్యార్థులు



బస్సు ఎక్కుతున్న ప్రజలు



వనపర్తి బస్టాండుకు కుటుంబ సభ్యులతో వెళ్తున్న విద్యార్థులు



వనపర్తి బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

వడ్డె ఓబన్న చరిత్ర భావితరాలకు చాటి చెప్పాలి

● ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న పోరాటం వీరోచితమని, ఆయన చరిత్రను భావితరాలకు చాటి చెప్పాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డె ఓబన్న జయంతి వేడుకలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా ఓబన్న చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... వడ్డె ఓబన్న జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వడ్డెరల అభివృద్ధి కోసం పాటుపడుతామని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వడ్డెరల సంఘం జిల్లా నాయకుడు దాసర్ల భూమయ్య, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, వడ్డెర సంఘం నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కందనూలుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాక

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు



శాయిన్‌పల్లిలో మార్కండేయ పంప్ హౌస్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి

బిజినేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఆదివారం రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రానున్నట్లు ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని తిమ్మాజీపేట మండలంలో పొతిరెడ్డిపల్లి గ్రామంలో ఉదయం పది గంటలకు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి బిజినేపల్లిలోని శాయిన్‌పల్లి గ్రామ సమీపంలోని మార్కండేయ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు మోటర్లను 11 గంటలకు ఆన్‌చేసి నీటి విడుదలను ప్రారంభిస్తారు. అలాగే పాలెం గ్రామంలోని ఇండస్ట్రీయల్ ఏరియాలో నూతనంగా నిర్మించతలపెట్టిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని 12 గంటలకు భూమిపూజ చేస్తారు. ఇక్కడి నుంచి తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి ఒంటి గంటకు శంకుస్థాపన చేసి నాగర్‌కర్నూల్ పట్టణంలోని తీగల వెంకటస్వామి ఫంక్షన్ హాల్‌లో పబ్లిక్ మీటింగ్‌కు హాజరుకానున్నారు. సాయంత్రం ఐదు గంటలకు నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం, గన్యాగుల గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి తిరిగి హైదారాబాద్ వెళ్ళనున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

జములమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జములమ్మ ఆలయానికి రోజురోజుకూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జములమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు. ఆలయ అధికారులు పూర్ణకుంబంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించారు. ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈవో పురేందర్ కుమార్ నూతన చైర్మన్ వెంకట్రాములు, పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీ కారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మ వారి దీవెనలతో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని తెలిపారు. జములమ్మ బ్రహ్మోత్సవా లకు మూడు రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుం టారు. అందుకు తగిన విధంగా సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. పాలకమండలి చైర్మన్, సభ్యులు ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమం లో పీఏసీఎస్ అధ్యక్షుడు సుభాన్, మార్కెట్ చైర్మన్ హనుమంతు, నాయకులు ఉన్నారు.



ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



సమావేశంలో మాట్లాడుతున్న తుషార్ గాంధీ, పక్కనే ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

సత్యశోధన బాపు పాదయాత్ర విజయవంతం

- గాంధీ, అంబేడ్కర్ ఆశయాలు కనుమరుగు చేస్తున్నారు
- గాంధీజీ ముని మనువడు తుషార్ గాంధీ

6

శ్రమదానంతో పూడికతీత

- కేఎల్ఐ కాల్వలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- స్వచ్ఛందంగా తొలగిస్తున్న అన్నదాతలు
- ముందుకు సాగని నీరు
- పట్టించుకోని అధికారులు



సూరాపూర్ సమీపంలోని కాల్వలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న రైతులు

6

విద్యానిధి విద్యార్థుల పెన్నిధి

(మొదటి పేజీ తరువాయి)

పాత పట్టణం. ఎప్పుడో ఇది కార్పొరేషన్ కావాల్సింది. ఇప్పుడు చట్ట సవరణ అయ్యింది. త్వరలో గవర్నర్‌కు వెళ్లి ముసాయిదా వస్తుంది. ఆ తర్వాత గెజిట్‌లో నమోదవుతుంది. కార్పొరేషన్ ఏర్పాటు వల్ల గౌరవం పెరుగుతుంది. ఇన్నాళ్లు 130 మునిసిపాలిటీల్లో ఒకటిగా నిధులు వచ్చాయి. ఇప్పుడు కార్పొరేషన్ కావడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తాయి. రూ. 250 కోట్ల నిధులు తేవడం లక్ష్యంగా పెట్టుకున్నాం.

నైపుణ్యాభివృద్ధిపై విజన్ ఎలా ఉంది?

మొత్తం మూడు లెవల్స్‌లో ఈ నైపుణ్యాభివృద్ధి అందించాలి. ఉన్నత విద్యాభ్యాసం ఉన్న వారికి, ఇంటర్, పదో తరగతి చదివిన వారికి, అసలు ఏమీ చదువుకోని వారికి శిక్షణ వేర్వేరుగా ఇవ్వాల్సి ఉంది. మూడో లెవల్‌లోనే చాలా మంది ఉన్నారు. కంప్యూటర్స్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు నడుస్తున్నాయి. సొంత ఖర్చులతో మొదటి బ్యాచ్‌లో 240 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. సెట్విన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ఇస్తాం. రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌ను ఏర్పాటు చేస్తుంది. విద్యా నిధి ద్వారా కూడా ఈ నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నాం.

పరిశ్రమలు, ఐటీ సేవలపై ఎలాంటి శ్రద్ధ ఉంది?

గత ప్రభుత్వంలో అనాలోచితంగా ప్రజలకు, పట్టణానికి దూరంగా ఐటీ టవర్ నిర్మించారు. దాంట్లో కంపెనీలు వచ్చి ఉండటం లేదు. రవాణా సౌకర్యం లేక, ఇతరత్రా వసతులు లేక ఎవరూ రావడం లేదు. ప్రస్తుతం అమర్‌రాజా వారు 200 మందికి శిక్షణ ఇస్తున్నారు. ఐటీ టవర్ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు పట్టణంలో నిర్మించే ఆలోచన చేస్తున్నాం.

అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు ఎలా ఉన్నాయి?

గతంలో కౌన్సిలర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేయలేదు. ఇప్పుడు వారి వార్డుల్లో ఏయే పనులు కావాలో వారినే ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించాం. మొత్తం క్రోడీకరించి రూ. 250 కోట్ల నిధులు తేవాలని నిర్ణయించాం. గతంలో కేవలం మెయిన్ రోడ్లు, బ్యూటిఫికేషన్‌పై శ్రద్ధ పెట్టి ప్రజల మౌలిక వసతుల కల్పనను మూలనపడేశారు. ఎక్కడికి పోయినా గల్లీ రోడ్లనే అడుగుతున్నారు. ఇప్పటికే ఏడాదిలో రూ. 120 కోట్ల పనులు చేపట్టాం.

వెయ్యి పడకల ఆస్పత్రి స్టేటస్ ఏంటీ?

వెయ్యి పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావొస్తోంది. వైద్యశాఖ మంత్రి ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు. అందుబాటులోకి వచ్చే సమయానికి డాక్టర్లు, కావాల్సిన సామగ్రి ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉన్నది. అనాలోచితంగా నిర్ణయాలు తీసుకొని స్టాఫ్ ప్యాటర్న్‌ను గతంలో అమలు చేయలేదు. పేరుకు అప్‌గ్రేడ్ చేశారు. బిల్డింగులు కట్టి వదిలేశారు. ఇప్పుడు అలా ఉండదు. రాజకీయ డిమాండ్ల ఆధారంగా పనులు చేస్తే ప్రజలకు భారం అవుతుంది.



ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ముడా నిధులు ఎలా వినియోగించబోతున్నారు?

ముడాలో మొత్తం మూడు నియోజకవర్గాలు ఉన్నాయి. నారాయణపేటలో ఒక భాగం, పరిగిలో కొంత భాగం ఉన్నాయి. 40:30:30 రేషియోలో పంచాలని అవగాహనకు వచ్చాం. మిగతా వారికి కూడా వారివారి ప్రాంతాన్ని బట్టి నిధుల కేటాయింపు ఉండనుంది. గతంలో ముడా నిధులను చెట్లు పెట్టడానికి, తీయడానికి మాత్రమే వినియోగించారు. ఇప్పుడు కమ్యూనిటీ హాళ్లు, పార్కులు నిర్మించి ప్రజలకు ఉపయోగపడేట్లు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మురుగునీటి వ్యవస్థపై ఎలాంటి కార్యాచరణ ఉంది?

టోపోగ్రఫీ పరంగా మహబూబ్‌నగర్ పట్టణం ఎత్తు, పల్లం, గుట్టలు, లోతట్టు ప్రాంతాలతో భిన్నంగా ఉన్నది. ఇక్కడ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ చేయడం సాధ్యం కాదు. కొత్త కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలకు ప్రాధాన్యమిస్తున్నాం. పాత వాటిలో యూడీజీ సాధ్యం కాదు. స్ట్రోమ్ వాటర్ డ్రెయినేజీల కోసం అమృత్ కింద రూ. 250 కోట్లతో ఎస్‌టీపీల వ్యవస్థను నిర్మిస్తున్నాం.

రూరల్ ప్రాంతానికి సాగునీటి ప్రణాళికలు ఏంటీ?

మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ కలిపి 33 శాతం ప్రాంతం నియోజకవర్గంలో ఉన్నది. కరివెన, ఉదండాపూర్ కెనాళ్ల ద్వారా సాగునీరు అందుతుంది. ఏమీ చేయకుండానే పీఆర్‌ఎల్‌ఐని 95శాతం పూర్తిచేశామని గొప్పలు చెప్పారు. ఈ ప్రాజెక్టులను పూర్తిచేయాలని ప్రత్యేకంగా సీఎంను కూడా ఎమ్మెల్యేలందరం కోరాము.

వైభవంగా కురుమూర్తిస్వామి గిరి ప్రదక్షిణ

- దేవరగట్టు చుట్టూ నడిచిన భక్తులు
- దాదాపు 4 కిలోమీటర్ల మేర కొనసాగిన ప్రదక్షిణ
- గోవింద నామస్మరణతో మారుమోగిన గిరులు

చిన్నచింతకుంట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి వెంకటేశ్వరస్వామి క్షేత్రంలో విశ్వహిందూ పరిషత్, ధార్మిక సంస్థల ఆధ్వర్యంతో శనివారం జరిగిన గిరిప్రదక్షిణ అంగరంగవైభవంగా జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఉమ్మడి జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాల నుంచి మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో జాతర మైదానానికి చేరుకున్నారు. ముఖ్యఅతిథులుగా దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరయ్యారు. మొదట గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని రాజగోపురం వద్ద లాంఛనంగా మంగళవాయిద్యాల నడుమ అర్చకుల వేదమంత్రాలతో ప్రారంభించారు. అక్కడి నుంచి స్వామి వారి మెట్లదారి గుండా గుట్టమీదకు, అక్కడి నుంచి పాతకోనేరు గుండా దేవరగట్టు సమీపం నుంచి అమ్మాపూర్ గ్రామం గుండా కురుమూర్తి జాతర మైదానానికి చేరుకున్నారు. కురుమూర్తిరాయుడు కొలువుదీరిన గుట్ట చుట్టూ దాదాపు 4 కిలోమీటర్లు గిరిప్రదక్షిణ కొనసాగింది. భక్తులు కురుమూర్తి స్వామి పాటలతో, గోవిందా నామంతో పరవశిస్తూ నడిచారు. సాధువులు భక్తుల్లో ఆధ్యాత్మికతను కలిగించేందుకు రాముని, కురుమూర్తి కథలను వినిపించారు. కార్యక్రమంలో దాదాపు 4వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఇందులో మహిళలు, వృద్ధులు కూడా పార్టీలకు అతీతంగా కార్యక్రమంలో ఎంతో భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కురుమూర్తి స్వామి రాజగోపురం వద్ద గిరిప్రదక్షిణకు హాజరైన దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి

గుట్టకింది భక్తులు దాసంగాలు

స్వామి వారి గిరి ప్రదక్షిణ సందర్భంగా శనివారం కావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారికి దాసంగాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తి స్వామి వారు తిరుమల శ్రీనివాసుని ప్రతిరూపమని, ఇక్కడకు వచ్చి దర్శించుకుంటే తిరుపతికి వెళ్లినట్లుగా భక్తులు భావిస్తారన్నారు. కొన్ని రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి కురుమూర్తిస్వామి వారిని దర్శించుకున్నారని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్ణాసుధాకర్‌రెడ్డి, సంస్థానాధీశులు రాజా శ్రీరాం భూపాల్, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి తనయుడు సిద్దార్థరెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు యాదిరెడ్డి, కార్యదర్శులు చంద్రయ్య, రమేష్ పాల్గొన్నారు.



స్వామి గుట్టపైకి వెళుతున్న భక్తజనం

కిడ్నాప్ కేసును 48 గంటల్లో ఛేదించిన పోలీసులు

- చిన్నారిని కిడ్నాప్ చేసిన బంధువు విజయవాడకు తరలింపు
- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించిన పోలీసులు
- నిందితుడి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) :పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని ఓ వ్యక్తికి పిల్లలను పెంచుకోవాలన్న ఆశ కలిగింది.. సంసారానికి పనికి రానని పెళ్లి చేసుకున్నా పిల్లలు కలగరని భావించిన సదరు వ్యక్తి బంధువుల అబ్బాయిని కిడ్నాప్ చేసి రాష్ట్రం దాటించాడు. అతని మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా 48 గంటల్లో పోలీసులు కిడ్నాప్ కేసును ఛేదించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జడ్చర్ల కొత్తతండాకు చెందిన కవిత, పాత్లావత్ రాజుకు ఇద్దరు కొడుకులు. కూలీ పనిచేసుకుంటూ పట్టణంలోని పద్మావతికాలనీలో నివాసం ఉంటున్నారు. నెలరోజుల క్రితం వీరివద్దకు ఖిల్లాఘణపురం మండలం తిరుమలాయపల్లి మీది తండాకు చెందిన కవిత మేనత్త కుమారుడు సబావత్ రాజు వచ్చాడు. అక్కడే ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నాడు. మూడేళ్ల కవిత చిన్నకొడుకు విక్కీని కిడ్నాప్ చేసి తన వద్దే పెంచుకోవాలని భావించిన రాజు బాలుడి ఆలనాపాలనా చూసుకుంటూ చాక్లెట్‌లు, బిస్కట్‌లు ఇచ్చి మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈనెల 8న పద్మావతీ కాలనీలోని అంగన్‌వాడీలో ఉంటున్న బాలుడిని కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నాడు. పాత్లావత్ రాజుకు చెందిన స్కూటీ తీసుకుని పనిమీద బయటకు వెళ్తున్నానని చెప్పి సాయంత్రం నాలుగు గంటల సమయంలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి బాబుకు దుస్తులు కొనిచ్చి పది నిమిషాల్లో తీసుకువస్తానని చెప్పి తీసుకెళ్లాడు. నేరుగా జడ్చర్లకు వెళ్లి అక్కడ ఎవరూ లేని తన కులానికే చెందిన సావిత్రికి విషయం చెప్పకుండా ఆమెను స్కూటీపై ఎక్కించుకుని విజయవాడ వెళ్లాడు. అంతకుముందు అతను విజయవాడలోనే పనిచేయగా, అక్కడికి వెళ్లి బాబును పెంచుకోవాలని నిర్ణయించుకున్నాడు. బాబును తీసుకురావడానికి తల్లి అంగన్‌వాడీకి వెళ్లగా మీ బంధువని చెప్పి బాబును తీసుకెళ్లాడని ఆయా చెప్పడంతో ఖంగుతున్న కవిత, భర్తతో కలిసి బాబుకోసం వెతికి అదేరోజు రాత్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు నిందితుడి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా విజయవాడలో ఉన్నట్లు తెలిసింది. వెంటనే రూరల్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుల్ మహేందర్‌నాథ్ విజయవాడ వెళ్లారు. ఐటీకోర్ టీమ్ సహాయంతో నిందితుడి లోకేషన్ గుర్తించి అదుపులోకి తీసుకుని మహబూబ్‌నగర్‌కు శుక్రవారం రాత్రి తీసుకొచ్చారు. శనివారం తల్లిదండ్రులను పిలిచి బాబును అప్పగించిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. రూరల్ ఎస్‌ఐ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిత్రంలో నిందితుడు



తండ్రితో బాలుడు విక్కీ

నీటి తరలింపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హరగోపాల్

పాలమూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-డిండి ఎత్తిపోతల పేరున, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటి తరలింపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి. పాలకులు మారినప్పుడు తమ ఆలోచనను మార్చుకోవటం సరికాదని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జి.హరగోపాల్, కన్వీనర్ యం.రాఘవాచారి, ఎ.తిమ్మప్ప, యం.వెంకట్రాములు, జి.వెంకట్ గౌడ్ కె.వెంకటేశ్వర్లు, ఎండీ ఇక్బాల్‌పాషా, కె.రవీంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో వ్యతిరేకించారు. పాలమూరు-డిండి ఎత్తి పోతలపై హైదరాబాద్‌లోని సుదరయ్య విజ్ఞానకేంద్రం, షోయబ్‌హాలులో విస్తృత రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 14 నియోజకవర్గాల ఉమ్మడి జిల్లా జల వనరుల కల్పన కృష్ణానదిలో నీటిలో తెలంగాణ రాష్ట్ర వాటా సాధన తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో జలవనరుల నిపుణులు, పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామిక వాదులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 2013 లోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మనం జూరాల నుంచి నీరు తీసుకునే విధంగా సాధించుకున్నామని తెలిపారు. జలవనరుల నిపుణులు, పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదుల సమక్షంలో చర్చ చేయనున్నట్లు తెలిపారు.

విజయవంతమైన సత్యశోధన బాపు పాదయాత్ర

- గాంధీ, అంబేడ్కర్ ఆశయాలు కనుమరుగు చేస్తున్నారు
- గాంధీజీ ముని మనువడు తుషార్ గాంధీ



అచ్చంపేటలో తుషార్‌గాంధీతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో గాంధీజీ, అంబేడ్కర్‌ల ఆశయాలను కనుమరుగు చేసే కుట్ర జరుగుతోందని మహాత్మాగాంధీ ముని మనువడు తుషార్ గాంధీ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో రిటైర్డ్ డీఈవో విజయకుమార్ చేపట్టిన బాపు బాటలో సత్యశోధన కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి తుషార్ గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. అచ్చంపేటలోని అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి తుషార్ గాంధీ మాట్లాడుతూ.. దేశంలో అంబేడ్కర్, గాంధీ ఆశయాలను కనుమరుగు చేసే కుట్ర జరుగుతోందన్నారు. నేటి తరం విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు పాదయాత్ర చేసిన విజయకుమార్‌ను ఆయన అభినందించారు. నేటి తరం విద్యార్థులకు మహనీయుల జీవిత చరిత్రను పాఠ్యాంశాల ద్వారా నే కాకుండా, పలు సందర్భాల్లో వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం మహనీయుల ఆశయ సాధనకు కృషి చేస్తోందన్నారు. అచ్చంపేట పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణకు తుషార్ గాంధీకి ఆహ్వానం పలికారు. మరోసారి తుషార్ గాంధీ నల్లమలను సందర్శించాలని, మహాత్ముడి ఆశయ సాధనకు తామంతా కృషి చేస్తామన్నారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ తాను 33 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో ఉద్యోగం చేసినప్పుడు కలుగని అనుభూతి, సంతోషం వంద రోజుల్లో పొందానని తెలిపారు. నేటితరం యువత మత్తు, డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోరాదని, బాపు చూపిన మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విజయ్ కుమార్ కుటుంబ సభ్యులు, గాంధీ స్మారక నిధి జాతీయ కార్యదర్శి సంజయ్ సింఘ్, టిషాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి, గాంధీ స్మారక రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) :నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నందివడ్డేమాన్‌లోని నందీశ్వరాలయ ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు నల్లని దుస్తులు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులతో పూజలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు.

శ్రమదానంతో పూడికతీత

లింగాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల సమీపంలోని కోమటికుంట నుంచి పెద్దకర్నంకుంట వరకు ఉన్న కేఎల్‌ఐ కాల్వలో పూడిక తీసేందుకు రైతులు శనివారం శ్రమదానం చేశారు. ఈ కాల్వలో దాదాపుగా ఐదు కిలోమీటర్ల మేరకు జమ్ము, ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు, రాళ్లు పేరుకపోయాయి. దీంతో సాగునీరు ముందుకు సాగకపోవడంతో ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. క్యాంపు రాయవరం, ధారారం, రాయవరం గ్రామాల రైతులు పూడికతీత గురించి సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందించకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శనివారం కాల్వలో పేరుకపోయిన పూడిక, పిచ్చిమొక్కలు, జనుము తొలగిం చేందుకు పూనుకున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్‌శాఖ ఏఈ పరమేష్‌ను వివరణ కోరగా కాల్వల నిర్వాహణను కాంట్రాక్టరు చూసుకోవాలి. రైతులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారు. కాంట్రాక్టర్ కొంత మేర పనులు చేశారు. ఈ కాల్వను కూడా శుభ్రం చేయాలని చెప్పాము, త్వరలోనే పూర్తిస్థాయిలో పనులు చేయిస్తామని తెలిపారు.



కాల్వలో పెరిగిన జమ్మును తొలగిస్తున్న రైతులు

పేద రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తాం

- స్పెయిన్ దేశ సందర్శకురాలు బ్లాంకా

అచ్చంపేటటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పేద రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామని స్పెయిన్ దేశ సందర్శకురాలు బ్లాంకా అన్నారు. ఆర్ డీటీ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధి లోని అంకిరోనిపల్లి గ్రామంలో 59 మంది పేద రైతులకు ఒక్కొక్కరికి 25స్ప్రింక్లర్ పైపులు, 8 నల్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద రైతులకు అండగా నిలిచేందుకు ఆర్‌డీటీ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. తక్కువ పెట్టుబడితో రైతులు ఎక్కువ లాభాలు పొందాలన్నారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాల విద్యార్థులకు చదవుకు అయ్యే ఖర్చులు సంస్థ అందిస్తూ చేయూత నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనాథ్, సుధాకర్‌రెడ్డి, సభ్యులు సీతారాం నాయక్, అంజనేయులు పాల్గొన్నారు.



అంకిరోనిపల్లి సమావేశంలో మాట్లాడుతున్న స్పెయిన్ దేశ సందర్శకురాలు బ్లాంకా

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మన్ననూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్ల బావి గ్రామానికి చెందిన వెంకటేష్ హైదరాబాద్‌లోని చక్రగిరి ట్రాన్స్‌పోర్టులో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ 10 రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి వాహన డ్రైవర్లు శనివారం వెంకటేశ్వర్లబావి గ్రామంలో దశదిన కర్మకు హాజరై రూ.33వేలు నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్‌లోనూ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వాహన డ్రైవర్లు సైదులు యాదవ్, తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు

నల్లమల కళాకారులకు నంది పురస్కారం

పదర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహితీ వేదిక, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ఆధ్వర్యంలో నల్లమల కళాకారుల సంఘం సభ్యులైన శ్రీకాంత్, పరమేష్, వీరేష్‌లు జాతీయ నంది పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ తెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బ్రహ్మజీ పోలోజు రాజకుమార్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రోగ్రామ్ సమన్వయ కర్త వేములవాడ రాధికలకు జానపద కళల్లో నైపుణ్యంతో పాటు, పల్లె ప్రతిభను గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ నంది పురస్కారం అందుకున్న వారికి నల్లమల కళాకారులు గాజుల లక్ష్మీనారాయణ, జక్క గోపాల్, మురళి, మోహన్, అశోక్ హర్షం వ్యక్తం చేశారు.

ఏడాది పాలనలో కాంగ్రెస్ విఫలం

- కుంటుపడిన కొల్లాపూర్ అభివృద్ధి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు

కొల్లాపూర్, జనవరి11 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల ముందు బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాదిలోనే ఘోరంగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు విమర్శించారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కుటుంబ పాలన ఉందని ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను వాడుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయలేదని ధ్వజమెత్తారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కొల్లాపూర్ నియోజకవర్గానికి 167 కే జాతీయ రహదారితో పాటు కృష్ణానదిపై ఐకానిక్ వంతెన సోమశిల టూరిజం అభివృద్ధికి దాదాపు రూ.70 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన స్పష్టం చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల బీజేపీ నూతన కార్యవర్గాన్ని సుధాకర్‌రావు శాలువాలతో సత్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామని కొల్లాపూర్ మునిసిపాలిటీలో బీజేపీ పాగా వేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు తమటం శేఖర్‌గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలె భరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

- అలరించిన గంగిరెద్దుల విన్యాసం

అచ్చంపేటటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి వేడుకలు పట్టణంలోని జీఎస్‌ఆర్ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక సంప్రదాయ ఆటపాటలతో అలరించారు. ఎద్దుల బండిపై ఎమ్మెల్యే డాక్టర్ వంశీకష్ణ, సతీమణి డాక్టర్ అనురాధ ఎక్కి ఊరేగించారు. విద్యార్థులు హరిదాసు వేషధారణలో ఎంతో ఆకట్టుకున్నారు. పాఠశాల గ్రౌండ్‌లో రంగవల్లులు వేశారు. గంగిరెద్దుల విన్యాసాలతో అందరిచూపరులను ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ రైతు ఇంటికి ధాన్యం చేరుతుంది కనుక ఈ పండగ రైతుల పండగ అని అన్నారు. కాడెద్దులు, పాడి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని గ్రామాలలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కౌన్సిలర్ సునీత, నాయకులు పాల్గొన్నారు.



గంగిరెద్దు విన్యాసాలు తిలకిస్తున్న ప్రజలు




ఎద్దుల బండిపై ఎమ్మెల్యే సతీమణి

రేషన్ బియ్యం పట్టివేత

మదనాపురం/కేటీదొడ్డి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మదనాపురం ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన మేరకు.. శనివారం తెల్లవారు జామున వనపర్తి మండలం మదనాపురంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బొలెరో వాహనంలో కొత్తకోట వైపు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయి. ఈ విషయాన్ని సివిల్ సప్లై అధికారులకు తెలుపగా వారు విచారించి రేషన్ బియ్యమేనని ధ్రువీకరించారు. ఈ మేరకు డ్రైవర్ మహేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

● అనుమతులు లేకుండా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలించే వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. కేటీదొడ్డి ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రానికి చెందిన ఎరుకలి నరసింహ అక్రమంగా ధరూర్ నుంచి రాయచూరుకు దాదాపు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కేటీదొడ్డి మండలంలోని పాతపాలెం మీదుగా తీసుకెళ్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నామన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎరుకలి నరసింహపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



మదనాపురంలో పట్టుబడిన రేషన్ బియ్యం ఆటో

కరెంట్ కోసం కర్షకుల కన్నెర్ర

» కొల్పూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

మాగనూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కరెంట్ సరఫరా సరిగా జరగటం లేదంటూ శనివారం కొల్పూరు కరెంటు సబ్‌స్టేషన్ ముందు రైతులు ఆందోళనకు దిగారు. నారాయణపేట జిల్లా మాగనూరు మండలంలో కొల్పూరు గ్రామ శివారులో గల లిఫ్ట్ ఇరిగేషన్‌కు పుంజనూరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు కొల్పూరు కరెంటు సబ్ స్టేషన్ నుంచి కరెంటు సక్రమంగా వదలక పోవడం, లోవోల్టేజీ సమస్యతో తమ పొలాలకు నీరందటం లేదంటూ ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా లిఫ్ట్ ఇరిగేషన్ అధ్యక్షుడు స్వామిగౌడ్ మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి లోవోల్టేజీ సమస్య గురించి అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వారు మండిపడ్డారు. కొల్పూరు సబ్‌స్టేషన్ వద్ద లైన్‌మన్ సక్రమంగా పని చేయడం లేదని మాగనూరు ఏఈకి తెలిపినా పట్టించుకోవడం లేదని వారన్నారు. పది రోజుల నుంచి లోవోల్టేజీ రావడంతో మోటార్లు రన్ కావడం లేదన్నారు. కరెంటు వైర్లు చెట్లపైన ఉండటంతో రైతులు చెట్లను తొలంగిచినట్లు స్వామిగౌడ్ తెలిపారు. ఈ లిఫ్ట్‌ల కింద పుంజనూరు, మందిపల్లి, గజరందొడ్డి, అడవి సత్కారం గ్రామాల శివారులోని పంట పొలాలకు నీరు అందుతుందన్నారు. ఇక్కడ లైన్‌మన్ వేణుగా పని చేస్తున్న మన్యంశెట్టిని తొలగించాలని వారు డిమాండ్ చేశారు. లోవోల్టేజీ సమస్య రాకుండా చూడాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని రైతులు తెలిపారు. పుంజనూరు లిఫ్ట్ అధ్యక్షుడు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.


కొల్పూరు సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

స్కాన్ చేయండి.. అభిప్రాయం చెప్పండి

» ప్రతీ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు » పోలీస్ శాఖ వినూత్న ప్రయత్నం
» టైప్ చేయొచ్చు.. వాయిస్ ద్వారా చెప్పొచ్చు » పర్యవేక్షించనున్న ఉన్నతాధికారులు

మహబూబ్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖ పనితీరుపై మీ అభిప్రాయం ఏమిటి? సరైన సేవలు లభిస్తున్నాయా? స్టేషన్‌కు వెళ్తే సిబ్బంది ఎలా రిసీవ్ చేసుకుంటున్నారు? ఫిర్యాదుదారులతో ఎలా వ్యవహరిస్తున్నారు? తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు పోలీసు శాఖ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందుకోసం క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టింది. దీనిని డీజీపీ జితేందర్ గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అలాగే అన్ని జిల్లాల్లోనూ పోలీసులు విడుదల చేశారు. పౌరులు ఎవరైనా సరే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియచేయొచ్చు. అందుకోసం టైప్ చేయవచ్చు లేదా వాయిస్ ద్వారా కూడా అభిప్రాయం చెప్పవచ్చు.

పని చేస్తుంది ఇలా?

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే భాషను ఎంచుకోవాలి. ఆ తరువాత పేరు, జెండర్, ఫోన్ నెంబర్, ఈ మెయిల్ అడుగుతుంది. ఆ తరువాత ఫీడ్‌బ్యాక్ కేటగిరీని క్లిక్ చేయాలి. అక్కడ పిటిషన్, ఎఫ్ఐఆర్, పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఈ చలానా, ఇతర అంశాలు అనే ఆప్షన్లు ఉంటాయి. వాటిలో మనకు కావలసిన ఆప్షన్ ఎంచుకోవాలి.

పోలీస్‌స్టేషన్‌కు ఎందుకు వెళ్లారో ఆప్షన్ ఎంచుకోవాలి. తరువాత పిటిషనర్ ఐడీ, తేదీ, పోలీస్‌స్టేషన్ పేరును ఎంచుకోవాలి. అప్పుడు ఆయా పోలీస్‌స్టేషన్‌లో మీకు అందిన సేవలపై ర్యాంకింగ్ ఇవ్వాలి. అక్కడ నాలుగు ప్రశ్నలుంటాయి. ఒక్కో దానికి ఐదు రేటింగ్స్ ఉంటాయి. పోలీస్‌స్టేషన్‌లో మిమ్మల్ని ఎలా రిసీవ్ చేసుకున్నారు? మీ ఫిర్యాదుపై ఎలా స్పందించారు? పోలీసులు ఎలా సేవలందించారు? చివరగా పోలీసుల తీరుపై ఏ మేరకు సంతృప్తి చెందారనే విషయాలపై రేటింగ్ ఇవ్వాల్సి ఉంటుంది.

ఆ తరువాత వంద పదాలకు మించకుండా మీ అభిప్రాయాన్ని తెలియచేయవచ్చు.



పోలీసుశాఖ విడుదల చేసిన క్యూఆర్ కోడ్

బాధ్యతగా పని చేసే అవకాశం

క్యూఆర్ కోడ్ ద్వారా పోలీసులు పౌరుల అభి ప్రాయాలను తెలుసుకొని, మరింత బాధ్యతగా పని చేసేందుకు అవకాశం ఉంటుంది. పోలీసు శాఖ గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకొని, అందుకు అనుగుణంగా సిబ్బంది పనితీరును మెరుగు పరుచుకోవచ్చు. శాఖపై ప్రజలకున్న అపోహలను, సందేహాలను, భయాలను తొలగించే అవకాశం కూడా ఉంటుంది.

అందరికీ అందుబాటులో..

క్యూఆర్ కోడ్‌పై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని పోలీస్‌శాఖ నిర్ణయించింది. అన్ని పోలీస్‌స్టేషన్‌ల ముందు దీనిని ఏర్పాటు చేయనున్నారు. మొబైల్‌లో యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను తెలుపడంతో పాటు ఎఫ్ఐఆర్, ఈ చలానా, ఫిర్యాదులకు సంబంధించిన స్థితిని కూడా తెలుసుకొనే అవకాశం ఉంటుంది.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో గడ్డి వాహనం దగ్ధం


డీసీఎంపై నీళ్లు చల్లుతున్న జప్తిసదగోడు గ్రామ యువకులు

ఉప్పునుంతల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గడ్డి డీసీఎం దగ్ధమైన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని జప్తిసదగోడు గ్రామ సమీపంలో చోటుచేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట మండలంలోని పుల్జాల గ్రామానికి చెందిన రైతు జప్తిసదగోడు గ్రామానికి చెందిన శ్యాంసుందర్‌రెడ్డి వద్ద వరి గడ్డి కొనుగోలు చేసి పుల్జాల గ్రామానికి వరి గడ్డి డీసీఎంలో తరలిస్తున్నారు. గ్రామ సమీపంలోని విద్యుత్ వైర్లకు వరి గడ్డి డీసీఎం తగ్గలడంతో ప్రమాదశాత్తు నిప్పు రవ్వలు వచ్చి గడ్డి దగ్ధమవుతుండగా గ్రామ యువకులు నీళ్లు చల్లారు. కిందికి వరి గడ్డిని నెట్టివేశారు. సుమారు 20 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు గ్రామస్థులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


వెంకట్రాములు (ఫైల్)

కోయిలకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని ఆంగపట్నం గ్రామానికి చెందిన గొల్ల వెంకట్రాములు (41) అదృశ్యమైనట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను ఎక్కడా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. వెంకట్రాములు గతంలో మద్యం సేవించే వాడని, 6 నెలల క్రితం నుంచి అనారోగ్య సమస్యతో ఇంటి దగ్గరే ఉండే వారని, 8వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదని తెలిపారు. అతని భార్య గొల్ల మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే కోయిలకొండ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

నారాయణపేటరూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా శనివారం టాస్క్‌ఫోర్స్ పేట పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని వారి దగ్గర రూ.6700ల నగదు, 5 ద్విచక్రవాహనాలు, ఒక బజాజ్ ఆటో, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ ప్రకారం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వెల్దండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను ప్రేమపేరుతో వేధించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండకు చెందిన ఓ యువతి (19) మండల కేంద్రంలో ఇటీవలే ఇంటర్ పూర్తిచేసింది. వెల్దండకు చెందిన కొప్పు నవీన్ మూడేళ్లుగా ఆమెను ప్రేమపేరుతో వేధించాడు. ఈ క్రమంలో శుక్రవారం భైరాపూర్ వెళ్లిన నవీన్ సదరు బాలిక ఇంటికి వెళ్లి ఆమెను వేధించాడు. ప్రేమిస్తున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహించిన యువకుడు కర్రతో యువతిని గాయపర్చాడు. దీంతో ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

15 బండిల్స్ చైనా మాంజా పట్టివేత

గద్వాల క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో నైలాన్, సింథటిక్ ధారాలతో తయారుచేసిన చైనా మాంజాలను విక్రయిస్తున్న దుకాణారులు అయిన లలిత దగ్గర 11 బండిల్స్, విజయ్‌కుమార్ దగ్గర నాలుగు బండిల్స్‌ను స్వాధీనం చేసుకొని వారిద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ చైనా మాంజాల వల్ల పర్యావరణానికి విపత్తుగా మారడంతో పాటు ప్రమాదాలకు కారణం అవుతుంది కాబట్టి వీటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

వెల్దండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని బొల్లంపల్లి, బండోనిపల్లి, చొక్కన్నపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఏడు ట్రాక్టర్ల బ్యాటరీలను గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. బొల్లంపల్లి గ్రామానికి చెందిన బ్రహ్మచారి, కానుగుల యాదయ్య, బండోనిపల్లికి చెందిన వావిళ్ల పర్వతాలు, చొక్కన్నపల్లికి చెందిన కుడుముల సుమంత్‌రెడ్డి, తాండ్ర సాయిలుకు చెందిన బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

కొల్లాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్ల గ్రామంలో ఆరేపల్లి భవాని (20) అనే యువతి తమ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు చెప్పిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గత మూడు నెలల క్రితం భవానికి పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామానికి చెందిన రాజేందర్‌తో వివాహం జరిగింది. శుక్రవారం సాయంత్రం పాతపల్లి నుంచి భర్తతో కలిసి తల్లి ఇంటికి వచ్చింది. శనివారం ఉదయం భర్త గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి పోగా ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త రాజేందర్ వచ్చే సరికి తలుపులకు లోపలి పక్కలో గొళ్లెం పెట్టుకున్నది. ఎంత పిలిచినా తలుపులు తెరువకపోవడంతో ఇరుగు పొరుగు వారితో కలిసి తలుపులు పగలగొట్టి చూడటంతో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే కొల్లాపూర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ చికిత్స చేస్తుండగానే మృతి చెందింది. మృతురాలి తల్లి చెన్నమ్మ, బంధువులు బోరున విలపించారు.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి

» క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం
» జాతీయ స్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ఐ హ్యాండ్‌బాల్ టోర్నీలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : హ్యాండ్‌బాల్ టోర్నీలో ఆయా రాష్ట్రాల క్రీడాకారులు ప్రతిభ చాటాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ఐ బాల, బాలికల హ్యాండ్‌బాల్ టోర్నీని శనివారం రెండో రోజు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో ఆరోగ్యంతో చదువులో చురుకుగా రాణిస్తారన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడా స్ఫూర్తిని చాటాలని క్రీడాకారులకు సూచించారు. అంతకు ముందు ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ. వెంకటేశ్, తెలంగాణ, జమ్మూకశ్మీర్ జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ శుభారంభం

- హ్యాండ్‌బాల్ టోర్నీలో తెలంగాణ బాల బాలికల జట్లు గెలుపు
- ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచిని రాష్ట్ర బాలుర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో నిర్వహిస్తున్న 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు జరిగిన లీగ్ మ్యాచ్‌లో నువ్వా నేనా అన్నట్లు జట్లు తలబడ్డాయి. తెలంగాణ రాష్ట్ర బాల బాలికల జట్లు శుభారంభం చేశాయి. బాలుర విభాగంలో జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు సీబీఎస్ఈడబ్ల్యూవోపై 25-05, మధ్యప్రదేశ్‌పై 21-09తో రెండో మ్యాచ్‌లో గెలిచింది. బాలికల విభాగంలో తెలంగాణ జట్టు జమ్మూకశ్మీర్‌పై 19-04తో గెలిచి శుభారంభం చేసింది. బాలుర విభాగంలో హర్యానా జట్టు పుదుచ్చేరిపై 22-10, కర్ణాటక జట్టు లడక్‌పై 13-04, చత్తీస్‌ఘడ్ జట్టు మణిపూర్‌పై 17-13, చత్తీస్‌ఘడ్ జట్టు సీబీఎస్ఈపై 30-09, వెస్ట్‌బెంగాల్ జట్టు త్రిపురపై 29-12, గుజరాజ్ జట్టు మహారాష్ట్రపై 20-18, ఉత్తర్‌ప్రదేశ్ జట్టు జమ్మూకశ్మీర్‌పై 20-14, రాజస్థాన్ జట్టు సీఐ ఎస్‌సీఈపై 23-08, ఆంధ్రప్రదేశ్ జట్టు సీబీఎస్ఈపై 24-21, త్రిపుర జట్టు అస్సాంపై 17-07, డీఏవీ, జట్టు సీబీఎస్ఈడబ్ల్యూవో జట్టుపై 30-14, బీహార్ జట్టు కర్ణాటకపై 15-07,కేవీఎస్ జట్టు పుదుచ్చేరిపై 19-11తో గెలిచాయి. బాలికల విభాగంలో వెస్ట్ బెంగాల్ జట్టు అస్సాంపై 11-04, మహారాష్ట్ర జట్టు ఐబీఎస్‌పై 18-01, బీహార్ జట్టు ఢిల్లీపై 14-11, హిమాచల్ ప్రదేశ్ జట్టు మణిపూర్‌పై 13-06, సీబీఎస్ఈ జట్టు కర్ణాటకపై 11-10, కేవీఎస్ జట్టు త్రిపురపై 10- 05, చత్తీస్‌ఘడ్ జట్టు డీఏవీపై 13-10, సీబీఎస్ఈ జట్టు లడక్‌పై 10- 03, రాజస్థాన్ జట్టు ఐపీ ఎస్ఈ 23-01 తేడాతో గెలుపొందాయి.


తలపడుతున్న తెలంగాణ, జమ్మూకశ్మీర్ బాలికల జట్లు

జాతీయ జట్టుకు ఎంపిక కావాలన్నదే లక్ష్యం



పాఠశాల స్థాయి నుంచే ఆటలపై మక్కువ. పీఈటీ సార్ ప్రోత్సాహంతో హ్యాండ్‌బాల్ ఎంపిక చేసుకున్నాను. జాతీయస్థాయి టోర్నీలో మొదటిసారి అవకాశం వచ్చింది. హ్యాండ్‌బాల్ క్రీడల్లో రాణించి జాతీయ జట్టులో ఎంపికావలన్నదే లక్ష్యం.

\- ఫరిహా, జమ్మూకశ్మీర్, క్రీడాకారిణి

దేశ సేవ చేస్తాం..



జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో రెండోసారి పాల్గొంటున్నాను. మా వ్యాయామ ఉపాధ్యాయుడు, కోచ్ కృషి వల్ల హ్యాండ్‌బాల్‌లో రాణిస్తున్నాను. జాతీయ జట్టుకు ఆడాలి..సైన్యంలో చేరి దేశ సేవ చేస్తా.

\- షోబో మండల్, వెస్ట్‌బెంగాల్ క్రీడాకారుడు

మన రాష్ట్రంలో ఆడినట్టే ఉంది..



జాతీయస్థాయి టోర్నీ ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌ను. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న టోర్నీలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఇక్కడ మన రాష్ట్రంలోనే అడినట్లు ఉంది. టోర్నీలో ప్రతిభ చాటి గెలుపు కోసం కృషి చేస్తాం.

\- లావణ్య, ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్

మూడో నేషనల్ ఆడుతున్నాను



మూడోసారి జాతీయస్థాయి టోర్నీలో పాల్గొంటున్నాను. గుజరాత్ జట్టుకు కెప్టెన్‌గా జట్టు విజయం కోసం కృషి చేస్తాను. మహబూబ్‌నగర్‌లో ఆతిథ్యం చాలా బాగుంది. మొదటి రోజు ఇబ్బంది ఉన్నా తరువాత ఏర్పాట్లు చేశారు. ఇక్కడ చాలా ప్రేమ, ఆప్యాయత చూపుతారు.

\- దర్శన్, గుజరాత్ జట్టు కెప్టెన్

24 క్వింటాళ్ల బెల్లం పట్టివేత

» కేసు నమోదు

కల్వకుర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న బెల్లంను సీజ్ చేసినట్లు ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం... కల్వకుర్తి పట్టణ సమీపంలోని జేపీనగర్ వద్ద శనివారం ఉదయం 4:30 గంటల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వాహనంలో 24 క్వింటాళ్ల బెల్లం, 40కేజీల అల్లం తీసుకెళ్తుండగా బొలెరో వాహనాన్ని అనుమానంతో పరిశీలించడంతో గుర్తించినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఉప్పునుంతల మండలానికి చెందిన వ్యాపారికి బెల్లం, అల్లం తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపాడని ఎస్ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన అక్రమంగా బెల్లం, అల్లం తరలిస్తున్న వాహనం

ఖోఖో టోర్నీలో రన్నర్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా మహిళల జట్టు


రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీలో రన్నర్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా మహిళల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో శనివారం జరిగిన రాష్ట్ర సీనియర్స్ ఖోఖో టోర్నీ ఉమ్మడి మహబూబ్‌నగర్ బాలికల జట్టు రన్నర్‌గా నిలిచింది. రాష్ట్ర స్థాయి టోర్నీలో రన్నర్‌గా నిలువడం జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఒబేదుల్లా కొత్వాల్, విలియం హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక


తనూజ

కృష్ణ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్-14 బాలికల ఖోఖో విభాగంలో కుస్సీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని తనూజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సౌమ్య తెలిపారు. ఈ నెల పది నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్ -14 తెలంగాణ ఖోఖో జట్టుకు తనూజ ప్రాతినిథ్యం వహిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఖోఖో ఆటలో అసమాన్య ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైన తనూజను పాఠశాల ప్రధానోపాధ్యాయుని బి.సంతోషి, ఏపీసీ చైర్మన్ దీప, పాఠశాల ఉపాధ్యాయ బృందం నరసింహులు, నరేందర్, రమేష్, ఖాసీం, అలీ, ఉష, సౌమ్య, నర్సింహులు, భారతి, నాగేష్, కుస్సీ, అలంపల్లి గ్రామ పెద్దలు అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి మన దేశం తరపున ఆడే జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని ఈ సందర్భంగా అభిలాషించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

» మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

జడ్చర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి జడ్చర్ల సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదానికి ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని మృతిచెందిన నూర్‌అహ్మద్ కుమారుడు ఇంతియాజ్‌పాషా ఫిర్యాదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల సమీపంలోని సింధూర హోటల్ సమీపంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారును, కాటన్ బేల్స్ లోడుతో ఉన్న లారీని, హైదరాబాద్ నుంచి అరుణాచలంకు ప్రయాణీకులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ ఢీ కొట్టడంతో ప్రైవేట్ ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ పట్టణానికి చెందిన నూర్‌అహ్మద్ (58)తో పాటు ట్రావెల్స్ క్లీనర్ చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన రాజా ఉర్ఫ్(55)లు మృతి చెందారు. ట్రావెల్స్ ప్రయాణిస్తున్న శ్రీకాంత్, రమ్య, సింధు, సంతోష్, సుమలత, రాధాకృష్ణ, ఉమాదేవి, హేమాంజలి, దేవిక, మున్నుస్వామి, అలివేల, ప్రతాప్, వెంకటేశ్, లక్ష్మీ, సాయిముఖేష్, రాఘవకృష్ణ, రజిత, విశ్వనాథ్‌తో పాటు బస్సు డ్రైవర్ షన్ముఖంకు స్వల్ప గాయాలయ్యాయని వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ వివరించారు.

ఇంటర్వ్యూ..

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి



వెల్దండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, పారిశుధ్య అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఎంతవరకు వచ్చింది ?

మండలంలోని 32 గ్రామ పంచాయతీల నుంచి 11,196 ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు వచ్చాయి. వీటికిగాను ఇప్పటికే 10,635 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాం.

స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి ?

మండలంలో 170 పోలింగ్ స్టేషన్లు గుర్తించాం. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

హరితహారం కార్యక్రమం ఎలా కొనసాగుతోంది ?

2025 సంవత్సరానికిగాను అన్ని గ్రామాలలో 2,72,000 మొక్కలు హరితహారంలో నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే 2 లక్షల వరకు నర్సరీలలో విత్తనాలు పెట్టడం జరిగింది. ప్రతీ గ్రామంలో 8500 మొక్కలు నాటేందుకు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. అదేవిధంగా ప్రతీతి గ్రామపంచాయతీలో వెయ్యి ఈతమొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

దేవాలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

వెల్దండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రజకుల ఆరాధ్య దైవం అయిన మడేలయ్య దేవాలయ నిర్మాణానికి పీఏసీఎస్ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు మట్ట వెంకటయ్యగౌడ్ శనివారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, పుల్లయ్య, హమీద్, రజక సంఘం అధ్యక్షుడు రేవెల్లె రవి, యువజనకాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్ ఉన్నారు.

వివేకానంద జయంతి వేడుకలకు ఏర్పాట్లు

మన్ననూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరులోని శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై గల వివేకానంద విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి తెలిపారు. కులమతాల కతీతంగా జరిగే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా బాబీదేవ్



బాబీదేవ్

కల్వకుర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడిగా ఇందిరానగర్ కాలనీకి చెందిన గన్నోజు బాబీదేవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన తల్లోజు ఆచారి, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులు

బిజినేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బిజినేపల్లి, మహదేవునిపేట, వట్టెం, మంగనూర్ గ్రామాలకు చెందిన 19 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని కోచ్ ధనలక్ష్మి ఆదివారం తెలిపారు. వీరిలో వైష్ణవి, యాస్మిన్, సంధ్య, హరిత, ప్రవళిక బంగారు పతకాలు సాధించగా వినతి, ఐశ్వర్య, ద్రాక్షావళి, దివ్య, గౌతమ్, చేతన్, కార్తీక్, నిశాంత్‌లు వెండి పతకాలు అందుకోగా, సాయిరాం, అంజలి, లవణ్, ప్రేమ్ సాగర్, అలీలు రాగి పతకాలను సాధించినట్లు పేర్కొన్నారు. వీరందరిని తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి మాస్టర్ శ్రీహరి, జిల్లా కార్యదర్శి శేఖర్, కోచ్ ధనలక్ష్మిలు అభినందించారు.

నిజాయతీ చాటుకుంటున్న ఆర్టీసీ కండక్టర్లు

కొల్లాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగస్తులు నిజాయితీగా విధులు నిర్వహిస్తు ప్రయాణికుల మన్ననలను పొందుతున్నారని డిపో మేనేజర్ ఉమా శంకర్ తెలిపారు. శనివారం పెబ్బేరు నుంచి కొల్లాపూర్‌కు బస్సులో ప్రయాణిస్తున్న అలీఅహ్మద్ అనే ప్రయాణికుడు బస్సులో తన ఫోన్ మరిచి పోయాడు. కండక్టర్ ఆంజనేయులు గమనించి ఆ ఫోన్‌ను తన వద్ద భద్రపరుచుకుని ఫోన్‌ను బస్సులో మరిచిపోయిన ఆ ప్రయాణికుడు తన ఫోన్‌కు ఇతర ఫోన్‌తో కాల్ చేయగా కండక్టర్ మాట్లాడి ఫోన్ తన వద్దనే ఉందని, కొల్లాపూర్ బస్టాండ్‌లో అప్పగిస్తాము రండి అని చెప్పాడు. కొల్లాపూర్ బస్టాండ్‌లో బస్టాండ్ మేనేజర్‌గా ఉన్న కేఆర్‌కేరెడ్డి సమక్షంలో బాధితునికి అందజేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. సదరు ప్రయాణికుడు కండక్టర్‌ను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 4, 5వ తేదీలలో ఇద్దరు ప్రయాణికులు కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్, ఇతర వస్తువులను, ఫోన్ మరిచిపోయిన ప్రయాణికులకు కండక్టర్లు భద్రపరిచి, సదరు ప్రయాణికులకు అప్పగించారని డిపో మేనేజర్ తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనర్సింహుడి బ్రహ్మోత్సవాలు

- అప్పాజిపల్లి నర్సన్నగుట్టపై ఏర్పాట్లు

- దాతల సహకారంతో దినదినాభివృద్ధి

తిమ్మాజిపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభుగా వెలిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12న ప్రారంభం కానున్నాయి. భక్తుల కోర్కెలు తీర్చే లక్ష్మీనరసింహస్వామి ఆలయం దాతల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతోంది. గుట్టపై గుహలో వెలిసిన లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడానికి ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు వస్తుంటారు. భక్తులు కాలినడకన గుట్టపైకి వచ్చేందుకు వీలుగా మెట్ల దారిని, వాహనాల కోసం మరో దారిని నిర్మించారు. తాగేందుకు కోనేటి నీరు ఉంటుంది. గుమ్మకొండ దగ్గర ముఖ ద్వారాన్ని నంది వడ్డెమాన్ గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుధాకర్‌రెడ్డి మన్నెమ్మ దంపతులు నిర్మించారు. కోడుపర్తి గ్రామవాసి చిలక కృష్ణారెడ్డి జ్ఞాపకార్థమై కుమారులు చిలుక సురేందర్‌రెడ్డి, చిలుక రాజేందర్‌రెడ్డిలు దాదాపు రూ.85లక్షల వ్యయంతో ఆలయ మంటపాన్ని, ఆలయ ఆవరణను, వాహనాల పార్కింగ్ కోసం విశాలంగా మార్చడం, గుట్టపైకి వచ్చిపోయేలా రహదారులను ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ద్వారా మంజూరైన రూ.68 లక్షలతో ఆలయాన్ని ఆధునీకరించి ఆంజనేయ స్వామి ఆండాలమ్మ మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయాలను నిర్మించారు. హైదరాబాద్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి దంపతులు ఐదు లక్షలతో వంటశాలను నిర్మించగా, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి తన నిధులతో భక్తుల కోసం మరుగుదొడ్లను నిర్మించారు. గుమ్మకొండ మాజీ సర్పంచ్ సత్యంయాదవ్ తనతండ్రి చిన్న చెన్నయ్య పేరిట పూలతోటను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి నరసన్న గుట్టపై కల్యాణ మంటపాన్ని నిర్మింప చేస్తామని ఆలయ ధర్మకర్తలు చిలుక సురేందర్‌రెడ్డి, చిలుక రాజేందర్‌రెడ్డి అన్నారు.



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

కార్యక్రమాలు

మొదటి రోజు 12వ తేదీన అంకురార్పణం, సుదర్శన హోమం, 13న లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం, 14న ఎద్దుల బండ్ల ప్రదర్శన ఉంటుంది. స్వామివారి కల్యాణానికి నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి పట్టు వస్త్రాలు తీసుకొస్తారు.

రహదారులతోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పూర్తి స్థాయిలో రహదారులు నిర్మిస్తేనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిలో సర్వారెడ్డిపల్లి గేటు వద్ద రూ.35 కోట్లతో మంజూరైన రెండు వరుసల రహదారి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వంగూరులో ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, రంగారెడ్డి, మల్లయ్య, పండిత్‌రావు, జంగయ్య, రమేష్‌గౌడ్, జనార్దన్, మల్లయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చారకొండ : మండలంలోని తిమ్మాయిపల్లి, దొంతుల గుట్టతండాకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, నాయకులతో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని గైరాన్ తండాలో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలని తండావాసులు ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలరాంగౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, నాయకులు సాయికుమార్, గోపి పాల్గొన్నారు.



రహదారి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఈదమ్మబండతండాలో ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలు నిర్వహించారు. క్రీడలను జైపాల్‌యాదవ్, గోలి శ్రీనివాస్ రెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విజితారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ వెంకటయ్యగౌడ్, అనిల్‌కుమార్, పత్యానాయక్, నిరంజన్, రాజునాయక్, ప్రసాద్, అంజి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


కల్వకుర్తి : మాడ్గుల మండలం దిలార్‌వాన్ ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య, భీమయ్యలు కడ్తాల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులకు పదివేల ఆర్థిక సహాయం అందించి, పార్టీ తరపున ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వట్టెపు బాలయ్య, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, కాటన్ మిల్లు అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రావు ఉన్నారు.

గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై సీపీఎం నాయకుడు దేశ్యా నాయక్

బల్మూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలలో సభలు నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్.దేశ్యానాయక్ కోరారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక గ్రామాలలో గ్రామ కమిటీలే తుది నిర్ణయమని చెప్పడంతో ఆ కమిటీ కాంగ్రెస్ పార్టీకి పరిమితమైందని ఆయన పేర్కొన్నారు. సీపీఎం బల్మూరు మండల కమిటీ సమావేశం ఎం.డి.లాల్‌మహ్మద్ అధ్యక్షతన బల్మూర్‌లో జరిగింది. దేశ్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేయడంలో పారదర్శకంగా ఉండాలని, ఏ స్కీమ్ అమలు చేసినా గ్రామసభ ద్వారానే ఎంపిక చేయాలని కోరారు. రైతులకు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. మండల కార్యదర్శి శంకర్‌నాయక్, బాబర్, ఆంజనేయులు, బాలు, కృష్ణయ్య, లక్ష్మణ్, రాముడు పాల్గొన్నారు.

భక్తులకు ధనుర్మాస కుడారై ప్రసాదం పంపిణీ



భక్తులకు కుడారై ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న పురోహితులు

కందనూలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం ప్రత్యేక పూజల్లో భాగంగా 27వ రోజు శనివారం గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక కుడారై ప్రసాదాన్ని నివేదించినట్లు రామాలయ ప్రధాన అర్చకులు వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజు స్వామివారు నిద్రలేచిన తదుపరి మరుసటి రోజు శ్రేష్టమైన సంపూర్ణంగా ఆవుపాలు తీపితో చేసిన ప్రత్యేక కుడారై ప్రసాదాన్ని నివేదన చేశామని తెలిపారు. గోదాదేమి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన భక్తులచే నిర్వహించారు. కుడారై ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అర్చకులు కందాడై శ్రీనివాసాచార్యులు, గోమటం మురళీ మోహన్ ఆచార్యులు, గోమటం శ్రీనివాసచార్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

గోదారంగనాయకస్వామి కల్యాణం

లింగాల : ధనుర్మాసం పురస్కరించుకొని స్థానిక కోదండరామాలయం ఆవరణలో శనివారం గోదారంగనాయకస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో విష్ణు సహస్ర, నామపారాయణం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కాడం శ్రీనివాస్ నియామకం



కాడం శ్రీనివాస్



కేతూరి నారాయణ

కొల్లాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కొల్లాపూర్ పట్టణ అధ్యక్షుడిగా కాడంశ్రీనివాస్, మండల అధ్యక్షుడిగా కేతూరి నారాయణలను నియమించారు. పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ చేసిన సిఫారసు మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు వారికి నియామక పత్రాలు అందించారు. కేతూరి నారాయణ, కాడం శ్రీనివాసులు మాట్లాడుతూ కొల్లాపూర్ మండలంలో బీజేపీ బలోపేతం కోసం కృషి చేస్తామని అన్నారు. తమకు పదవీ బాధ్యతలు అప్పజెప్పిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావుకు జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్, అసెంబ్లీ కన్వీనర్ మేకల శ్రీనివాస్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు తమటం శేఖర్‌గౌడ్ పార్టీ నాయకత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్



జ్యోతి నాయక్ తండాలో క్రీడాకారులతో డీఎస్పీ శ్రీనివాస్

పదర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ అరెస్టులు అనేవి ఉండవని, సైబర్ నేరాల నుంచి ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అచ్చంపేట డీఎస్పీ పల్లే శ్రీనివాస్ అన్నారు. ఆయన శనివారం మండలంలోని జ్యోతి నాయక్ తండాలో నిర్వహించిన క్రికెట్ ఆటను ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలో రైతులతో మాట్లాడుతూ ఆరుగాలం పండించిన పంటను అమ్ముకునే సమయంలో తూకంలో మోసపోకుండా రైతులందరు సంఘటితమై తూకం చేసే కాంటాను ముందట పరీక్షించాలని, ఆ తరువాతే పత్తి అమ్ముకోవాలని అన్నారు. యువత గంజాయి, సారా, సిగిరేటు తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సద్దాం హుసేన్, యుతవ సాయి రాథోడ్, రమేష్, నరేష్, మత్రు, కుమార్, సంతోష్ ఉన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

కల్వకుర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన న్యాయవాది యాదిలాల్ రూపొందించిన క్యాలెండర్, డైరీని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. సమాజంలో సేవను బట్టి కీర్తి లభిస్తుందని తెలిపారు.

స్పెషల్ బస్సుల పేరుతో అదనపు చార్జీలు

కొల్లాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ టు హైదరాబాద్ వచ్చిపోయే బస్సుల్లో చార్జీలు రూ. 260 అయితే కేవలం స్పెషల్ బస్సుల పేరుతో వంద రూపాయలు అదనంగా ఆర్టీసీ అధికారులు వసూలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు డీపీ కుమార్ మాదిగ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 50 శాతం అదనంగా పెంచామంటూ చెబుతూనే ఈ అదనపు చార్జీలు ఎందుకు తీసుకుంటున్నారో ప్రజలకు అర్థం కాక ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

గుండెపోటుతో జూనియర్ లైన్‌మన్ మృతి



మృతి చెందిన రఘు (ఫైల్)

కొల్లాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామంలో శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో (36) యువకుడు మృతి చెందాడు. శనివారం తెల్లవారు జామున రఘుకు ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గత ఏడాది రఘుకు విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా ఉద్యోగం రావడంతో కొల్లాపూర్‌లో ఐపీడీఎస్ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రఘుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రఘు మృతదేహానికి మాజీ సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి రఘుపతిరావు, కొల్లాపూర్ మునిసిపల్ కౌన్సిలర్ మాచుపల్లి బాలస్వామి, ట్రాన్స్‌కో అధికారులు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూలిన విద్యుత్ స్తంభం - తప్పిన ప్రమాదం

పెంట్లవెల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామంలో ఎనిమిదో వార్డులో ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి విద్యుత్ స్తంభం విరిగి అప్పుడే వెళ్తున్న ట్రాక్టర్‌పై పడింది. స్థానికులు వెంటనే గమనించిచ విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. డ్రైవర్‌తో పాటు చుట్టూ పక్కల ఉన్న వారు చాకచక్యంగా తప్పించుకున్నారు. శనివారం ఉదయం విద్యుత్ అధికారులు వచ్చి మరమ్మతులు చేపట్టారు. గ్రామస్థులు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు, వైర్లు పాతవి కావడంతో ఇప్పటికే చాలా స్తంభాలు విరిగి పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వేడుకలు నిర్వహించడం సంతోషం

- సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబురాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శనివారం ముందుస్తు నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి చిన్నారులు వేసిన రంగవల్లులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పండగ సంప్రదాయాలు కొనసాగిస్తూ భవిష్యత్ తరాలు గుర్తించేలా వేడుకలు నిర్వహించం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తీగల సునేంద్ర, కొత్త శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు రేణుబాబు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రీ సేవలు చిరస్మరణీయం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు

కొల్లాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి 59వ వర్ధంతి వేడుకలను పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరమైన జీవితం, నీతి నిజాయతీకి నిలువెత్తు నిదర్శనంగా పరిపాలన కొనసాగించారని అన్నారు. నిరుపేదలకు దుస్తులు, పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్, రాము యాదవ్, వెంకటస్వామి, శ్రీను, జుబేర్‌ఖాన్, రజక స్వామి కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ మేధావుల మహాసభకు తరలిన ఉద్యోగులు



జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి హైదరాబాదుకు తరళి వెళ్తున్న మాదిగ ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ టౌన్/ కల్వకుర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన మాదిగ మేధావుల సంఘీభావ మహాసభకు శనివారం జిల్లా కేంద్రం నుంచి మాదిగ ఉద్యోగులు తరళివెళ్లారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మహాసభకు బయలుదేరి వెళ్లారు. మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వివిధ సామాజిక వర్గాలకు చెందిన మేధావులు మద్దతు తెలుపుతున్నారన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగులు కురుమూర్తి, సరేందర్, కురుమయ్య, రమేష్‌చంద్ర, నారాయణ, మానస, మద్దిలేటి, రామచందర్, బాలలక్ష్మయ్య, సైదులు, రామకృష్ణ పాల్గొన్నారు.

కల్వకుర్తి నుంచి మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు జున్న గోపాల్‌రావు, మాదిగ ఉద్యోగుల కల్వకుర్తి డివిజన్ అధ్యక్షుడు ఇంజమూరి భాస్కర్, ప్రధాన కార్యదర్శి రామేశ్వరయ్య ఆధ్వర్యంలో భారీ ఎత్తున హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వెళ్లారు. మాదిగ ఉద్యోగులకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ, నాయకులు వీరస్వామి మాదిగ, నాగేష్‌లు సంఘీభావం తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు.

క్రీడలను స్నేహపూర్వకంగా నిర్వహించుకోవాలి

- వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జూపల్లి భాస్కర్‌రావు

చారకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని జూపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను శనివారం వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు ప్రారంభించారు. క్రీడాపోటీలను స్నేహపూర్వకంగా నిర్వహించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముస్తఫా ముజ్జుబాయి, డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్, డీసీసీ కార్యదర్శి పాలాది బాలరాజు, మాజీ ఉపసర్పంచ్ జగపతి, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మండలంలోని జూపల్లి గ్రామంలో ఎల్క శ్రీను అనారోగ్యంతో శనివారం మృతి చెందగా భాస్కర్‌రావు ఆ ఇంటికి వెళ్లి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

బల్మూరు : క్రీడలతో మానసికోల్లాసాన్ని పొంది ఆరోగ్యంగా ఉంటారని మాజీ ఎంపీపీ వేనేపల్లి అరుణ నరసింహారావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొండనాగుల గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులతో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగ గిరివర్ధన్‌గౌడ్, సీనియర్ నాయకులు శ్రీపతిరావు, మైలారం గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఆంజనేయస్వామి, శాంతన్ కుమార్ రెడ్డి, సుదరశన్, ఖదీర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ చంద్రమోహన్‌యాదవ్, అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కల్వకుర్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం వెంకటాపూర్, వెంకటాపూర్‌తండాలోని వృద్ధులకు లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ బండెల రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో వృద్ధులకు, వికలాంగులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి లయన్స్, ఐ ఆసుపత్రి చైర్మన్ దామోదర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కోశాధికారి నరసింహ, లయన్ జూలూరి రమేష్, నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి



పెద్దకొత్తపల్లిలో వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

పెద్దకొత్తపల్లి/ ఊర్కొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి, ఊర్కొండ మండలాల్లో వడ్డెర సంఘాల ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలను జరుపుకున్నారు. పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లి గ్రామంలో వడ్డెర సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. పెద్దకొత్తపల్లిలో బీసీ సంక్షేమ సంఘం తాలూకా ఇన్‌చార్జి జెర్పాటి కురుమూర్తి మాట్లాడుతూ వడ్డె ఓబన్న స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డె ఓబన్న జయంతిని వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు పసుపుల నరసింహ, ఉపాధ్యక్షులు ఈరదిండ్ల మల్లేష్, దండుగుల మద్దిలేటి, నాయకులు ఆలకుంట లక్ష్మణ్, నిరంజన్, దశరథం, రాజు, అంజి, హరీష్, పురుషోత్తం, పండు, వినయ్, శివ తదితరులు పాల్గొన్నారు.